# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

## రేడియో శ్రీలంకద్వారా క్రీస్తు సంఘముల
## కార్యక్రమములు

---

తెలుగు : సత్యవాణి (The Voice of Truth)
ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం 2-30 గంటలకు.

తమిళం : సత్యవాణి (The Way of Truth)
మంగళవారం - 5-30 p.m.
గురువారం
ఆదివారం } - 6-45 p.m.

మలయాళం : The Voice of Truth
మంగళ, శుక్రవారాలు 3-45 p.m.

కన్నడ : The Voice of Tru'h
ఆదివారం - 1-45 p m.

హింది : సత్యసమాచార్
మంగళ, గురు, శుక్రవారాలు 9-00 p.m.
ఆదివారం - 12-45 to 1-00 p.m.

ఇంగ్లీషు : The Voice of Truth
సోమవారం - 9-00 p.m.
శుక్రవారం - 7-45 p.m.

---

ఈ కార్యక్రమాలను అందరు వినండి. అందరికీ విన్పించండి.

---

Razan Electric Press, Kakinada-1.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 11 సెప్టెంబరు 1989 సంచిక 2


# సంపాదకీయము

## వేదన బాధల సమస్య

## ( The Problem of Pain and Suffering )

వేదన మరియు బాధ ఈ రెండు సార్వత్రిక సమస్యలు. మనం ఏదో ఒక సమయంలో వీటిని అనుభవిస్తున్నాం. వీటిని మనం అర్థం చేసికొనకుండ, వాటి ద్వారా మనం నేర్చుకొనకుండ, వాటి ద్వారా మనం ఎదగకుండ, వాటి ద్వారా మనం గాయపర్చబడకుండ ఎట్లు వాటిని ఎదుర్కొనగలం?

వేదన, బాధ ఈ సమస్యలు ఎదురైనప్పుడు చాలా మంది దేవుని నిందించుటకు సిద్ధపడుచున్నారు. యుద్ధాన్నిగాని, కరవుగాని మానవులకు బాధ కలిగించే మరియొక సమస్యగాని దేవుడెందుకు కలుగజేయాలని ప్రశ్నించుచున్నారు. దీనికి వ్యతిరిక్తముగా అనేక సమస్యలు మానవుడే తనకొరకు సృష్టించుకొనుచున్నాడు. ఉదాహరణకు నీవు ఎక్కువగా తింటే నీవు అస్వస్థతకు గురియౌదువు. నీవు మద్యపానాన్ని సేవిస్తే దానికి బానిసవై నిన్ను నీవే చంపుకొందువు. నీవు నీ వాహనాన్ని ఎక్కువ వేగంతో నడిపితే నిన్ను నీవు గాయ

పర్చుకొని యితరులను కూడ గాయ పర్చెదవు. నీవు జూదం ఆడితే నీ ధనాన్ని నష్టపోదువు. నీవు నీతి బాహ్యమైన పనులు చేస్తే కొన్ని వ్యాధులు నీకు కలుగును. ఇలా ఇంకా ఎన్నో సంగతులు చెప్పకొన వచ్చును. మరో మాటలో చెప్పాలంటే పాపము, చెడ్డపనులు చేయుటవలన వాటితో కూడ కొన్ని దుష్ఫలితాలు కలుగుతాయి. పాపమువలన వచ్చు జీతము మరణమని పౌలు చెప్పెను (రోమా 6 : 23).

యుద్ధాన్ని గురించి ఏమిటి? దాన్ని ఎవరు ప్రారంభించారు? దాని విషయంలో దేవుని నిందించకూడదు. ఒక గృహంలో భార్యాభర్తలు విడిపోయినప్పుడు లేదా తల్లిదండ్రులు పిల్లల విషయంలో బాధ్యతా రహితంగా నున్న సమయంలో బాధ అనుభవించే పిల్లల విషయం ఏమిటి? కొన్నిసార్లు వారు చేయని నేరానికి బాధింపబడడం నిజమే. కాని దానికి కారణం దేవుడు కాదు. దేవుడు ఎందుకు ఈ పరిస్థితులను కలుగచేయాలని నీవు అనుకొనవచ్చును. దేవుడే ఒకవేళ మానవులపై వత్తిడి కలుగచేసి మన యిష్టాన్ని జరుగనివ్వకుండా ఉంటే ఈ సమస్యలన్నీ లేకపోయి ఉండును. కాని ఆయన మానవులపై వత్తిడి చేయడంలేదు. చాలా మంది ఆయన అలాచేస్తే ఈ సమస్యలేమీ లేకపోవును కదా అని అనుకొనవచ్చును.

తుఫానులవలన ప్రజలు చనిపోవడం, గాయపర్చబడడం అనేక రీతుల్లో జరుగుచున్నది. దీనికి బాధ్యత దేవునిది కాదా? నిజానికి కాదు. దేవుడు లోకమును అందలి సమస్తమును నిర్మించెను. ఆయన ప్రకృతిని సృజించి దానికి ఒక క్రమాన్ని ఏర్పాటు చేసాడు. ఆదియందు ప్రకృతి వ్యతిరిక్తముగా పనిచేయుటకు వీలుగాను అది సృజింపబడలేదు. మానవుడు పాపము చేసినపుడు శిక్షగా ప్రకృతిలో బీభత్సములు జరుగుచున్నాయి. భూమి ముండ్ల తుప్పలను గచ్చ

పొదలను నీకు మొలిపించును (ఆది కాం. 3:17-19). జలప్రళయము, ప్రకృతి వాతావరణంలో గొప్ప మార్పు పాపము మూలముగా కలిగెను (ఆది కాం. 6, 7). వాతావరణ పరిస్థితులు ఒక కేంద్ర స్థానానికి వచ్చినప్పుడు వర్షము, గాలి, తుఫాను ఏర్పడి నష్టము కలిగించును. మానవుడు ముందు జాగ్రత్తలు తీసికొనినప్పుడు, చాలా సందర్భాలలో అతడు నష్టపోకుండా ఉంటాడు.

చివరిగా మానవుడు మరణమనే సమస్యను ఎదుర్కొంటు న్నాడు. ఇది కుటుంబ సభ్యులకు గొప్ప దుఃఖాన్ని కలిగించును. ఇది కూడ ప్రకృతి సిద్ధమైన చట్టమే. ఆదాము, హవ్వ జరిగించిన పాపము యొక్క ఫలితము లోకములో ఉన్నది (ఆది కాం. 3 : 1-5; ఆది కాం 3 : 22-24).

వేదన, బాధ నిమిత్తమై దేవుని నిందించ కూడదు. వాటిని అర్థం చేసికొని, వాటితో జీవించి, వాటిద్వారా ప్రయోజనం పొందుటకు ప్రయత్నించాలి. మనం బాధింపబడాలని కోరుకొనము. ఇతరుల వేదనను మనం చూడడానికి ఇష్టపడము. అలాగే దేవుడు కూడ మానవుడు గాయపడాలని కోరడంలేదు. బాధలు మనతో ఉన్నాయి. అవి మన జీవితంలో ఒక భాగం. అందుచేత వాటితో మనం జీవించి వాటిని అధిగమించే సాధనలో ఉండాలి. దీనికి ముఖ్యకారణం ఏమంటే మనం ఈలోకంలో రక్షింపబడడానికి దేవుని సహాయం కొరకు ఎదురు చూచి ఆయనకు విధేయులము కావాలి. ఆయనకు నమ్మకమైన వారముగా యుంటే పాపముగాని కన్నీరుగాని, బాధలు గాని, ఎడబాటుగాని, మరణముగాని లేని పరలోకము లోనికి వెళ్ళ గలము. నా స్నేహితుడా, క్రైస్తవ జీవితము అన్నిటి కంటె మంచి జీవితము. ప్రభువు ఆత్మలకొరకు నిరంతరం సంతోష సౌభాగ్యములు గలిగిన నిత్యనివాసము సిద్ధపరచి యుంచాడు.

బాధ వేదనతోపాటు కొన్ని మంచి సంగతులు కూడ ఉన్నాయి. ఉదాహరణకు: మన శరీరంలో కలిగిన బాధ ఏదో ఒక తప్పిదానికి గుర్తుగా నున్నది. అట్టి జ్ఞానముతో మనం దానిని సరిచేసికొనడానికి అవసరమైన ప్రయత్నములు చేసికొనవచ్చును. ముఖ్యమైన సంగతి ఏమనగా మనం గాయపర్చబడి, అవసరాలలో ఉన్నప్పుడు దేవుని తట్టు తిరిగి ఆయనకు సమీపముగా నుండి సహాయమును కోరుదుము. వేదన బాధల ద్వారా ఎదుగుటకు ఇది గొప్ప ఆశీర్వాదము.

ముగింపుగా ప్రతివిషయంలోను మంచిచెడ్డ సంగతులుంటాయి. వేదననుండి బాధనుండి మేలు పొందినట్లయితే "దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము" (రోమా 8 : 28) అను లేఖన భాగాన్ని నెరవేర్చుటకు సహకరిస్తున్నాము.

---

## మన శరీరములను దేవునికి సమర్పింపవలెను

పౌలు రోమాలో నున్న క్రీస్తు సంఘమునకు ఈ విధముగా వ్రాయుచున్నాడు: "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది" (రోమా 12 : 1). ఈ వాక్యము మనకును వర్తించుచున్నది. అయితే మనము ఎందుకు దేవుని సమర్పించుకొనవలెను? దేవుడే ఆజ్ఞాపించుచున్నాడు గనుక మనము సమర్పించుకొనబద్ధులమై యున్నాము. దేవుడు

మనపై చూపించు జాలి, దయ, ప్రేమ, కృపలనుబట్టి మనం సమర్పించు కొనవలెను. అంతేగాక మనము ప్రతీ యీవిని దేవుని యొద్ద నుండి పొందుచున్నాము. ఉచితముగా గాలి, నీరు, వెలుతురు, జీవించుటకు గల ప్రతీదానిని దేవుని నుండి పొందుచున్నాము. అట్లే మనపాపములను క్రీస్తు రక్తము చేత కడిగివేసికొని రక్షింపబడిన వారమై పరలోకమును పొందుటకు అర్హతను పొందితిమి. ఇది ఎంత గొప్పభాగ్యము. ఇది దేవుని వలననే కలిగినది. కనుక మనము దేవునికి ఏమి సమర్పించు కొనగలము ?

## బలులు కాదు

పాతనిబంధనలో ఇశ్రాయేలీయులు వారి పాప పరిహారార్థమై జంతువులను బలిగా సమర్పించెడివారు. అయితే ఆ బలులు సరియైనవి కావు. అవి పాపములను తీసివేయు లేవు (హెబ్రీ 10:1-4). ఆ కాలము లోనే దేవుడు ఇట్లు చెప్పాడు: "నేను బలిని కోరనుగాని కని కరమునే కోరుచున్నాను" (హోషేయ 6 : 6). "నీతి న్యాయములు అనుసరించి నడచుకొనుట బలులు అర్పించుట కంటె యెహోవాకు ఇష్టము" (సామెతలు 21 : 3). కనుక దేవుడు జంతువులను గాక మన శరీరములను ఆయనకు సమర్పించు కొనవలెనని కోరుచున్నాడు. అయితే మన శరీరములను ఎట్లు దేవునికి ఈయగలము? మనము కోయ బడవలెనా, మనము మన రక్తమును చిందింపవలెనా ? కానే కాదు. ఈ విధముగా చేయుట దేవునికి ఇష్టము కాదు. అయితే ఈక్రింది విధముగా మన శరీరములను దేవునికి సజీవ యాగముగా సమర్పించు కొనగలము.

## సమర్పించుకొను విధము

1. విశ్వాసములో ఎదుగుట ద్వారా మన శరీరములను దేవునికి సమర్పించు కొనగలము. విశ్వాసము ఒక యాగము వంటిదని

పౌలు ఫిలిప్పీ 2 : 17 వచనములో చెప్పుచున్నాడు. విశ్వాసమందు స్థిరముగా ఉండాలి, విశ్వాసంతో కొనసాగాలి. శరీరమునకు కలుగు ఆపదలలో శ్రమలలో మనము దేవుని యందలి విశ్వాసమును కనుబరచవలెను.

2. దేవునిని ఆత్మీయంగా ఆరాధించుట సరియైన యాగము. "ఆత్మతోను సత్యముతోను దేవుని ఆరాధించవలెను" (యోహాను 4 : 24). ఆత్మతో ఆరాధించుట అనగా పూర్ణమనస్సుతోను, పూర్ణ వివేకముతోను, పూర్ణ హృదయముతోను, పూర్ణ శక్తితోను దేవునిని ప్రేమించి ఆరాధించుట. సత్యముతో ఆరాధించుట అనగా వాక్య ప్రకారము ఆరాధించుట (యోహా 17 : 17). పాటలు పాడునప్పుడు అర్థం చేసికొని మనస్సుతో పాడాలి. ప్రార్థన చేయునప్పుడు మన మనస్సు దేవునిపై కేంద్రీకృతము కావాలి, వాక్యం వినునప్పుడు గ్రహించి, మన జీవితాలకు అనువర్తింప జేసికోవాలి. ప్రభురాత్రి భోజనము తీసికొనునప్పుడు దాని ఉద్దేశ్యమును మరువక జ్ఞానముతో తీసికోవాలి, కానుకలు చెల్లించునప్పుడు దేవుని ఆజ్ఞను మరువక మన గుప్పిళ్ళను విప్పాలి. ఇదియే సరియైన యాగము, అనుకూలమైన యాగము.

3. మన శరీరమును దేవునికి సమర్పించవలెనంటే లోకము యొక్క ఆశలకు మన శరీరమును గురిచేయరాదు. "తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును, నిష్కళంకమైన భక్తి ఏదనగా...... ఇహలోక మాలిన్యము తన కంటకుండా తన్ను తాను కాపాడుకొనుట యునే" (యోహా 1 : 27). "ఈ లోకముతో స్నేహము చేయువాడు దేవునికి శత్రువగును" (యాకో 4 : 4). "లోకములో ఉన్నదంతయు శరీరాశ, నేత్రాశ, జీవపు డంబము, ఇవి తండ్రివలన పుట్టినవి కావు" (1 యోహా 2 : 15-16). "శరీరేచ్ఛలను నెరవేర్చుటకు శరీరము

విషయమై ఆలోచన చేయకుడి" (రోమా 13 : 14). "ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించుడి" (1 పేతురు 2 : 11). శరీర కార్యములను గూర్చి మనము గలతీ 5:19-20 వచనములలో చదువగలము. అవి జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహములు, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములులు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు. కనుక మనము పై విషయములలో కొనసాగుచున్న యెడల మన శరీరమును దేవునికి ఇచ్చుటలేదు.

## నేత్రాశకు లొంగకూడదు

మనము నేత్రాశకు లోనగుచున్న యెడల మనము దేవునికి సమర్పించు కొనుటలేదు. ఇంద్రియాలలో ప్రధానమైనది నేత్రము. అయితే కంటికి తృప్తి అనేదిలేదు. "నరుల దృష్టి తృప్తి కానేరదు" (సామె 27 : 20). చెడుచూపు వలన మనము దేవునికి దూరమగుచున్నాము. అందుకే క్రీస్తు ఇట్లు చెప్పెను: "నీ కుడికన్ను నిన్ను అభ్యంతర పరచిన యెడల దాని పెరికి నీయొద్ద నుండి పారవేయుము" (మత్తయి 5:29). కాబట్టి నేత్రాశకు మనము లోను కారాదు.

కనుక క్రైస్తవుడు లోకమునకు భిన్నముగా ఉండవలెను. మాటలోను, ప్రవర్తనలోను, క్రియలలోను వాక్యానుసారముగా ఉన్న యెడల మనము మన శరీరమును దేవునికి సమర్పించుకొనగలము.

4. మన శరీరములను దేవునికి సమర్పించుట అనగా మన శరీరములను దేవుని ఆలయముగా చేయుట. మన శరీరములు మనవి కావు. ఇవి దేవుని వలన కలిగినవి (1 కొరింథి 6 : 19). "మీ దేహములు దేవునికి ఆలయమై యున్నవి" (1 కొరింధి 3 : 16). కనుక మనము మన దేహముతో దేవుని మహిమ పరచవలెను. అనగా

మన శరీరమును శరీర కార్యములకు దూరముగా నుంచవలెను (1 కొరింధి 3 : 17). శరీరమును శరీర కార్యములనుండి కాపాడు కొనుట శారీరకముగాను, ఆత్మీయంగాను మంచిది. ఉదా॥ దొంగ తన దొంగతనమును మానివేయుటవలన అతడు శిక్షలనుండి విముక్తి పొందును. అంతేగాక ఆత్మీయంగా అతడు తన శరీరములోనికి క్రీస్తును ఆహ్వానించును. వ్యభిచారి తన తప్పును తెలిసికొని ఆ పాపమును మానివేసిన యెడల శారీరకంగా ఆరోగ్యవంతుడగును. — దేవునికి విధేయుడై ఆత్మీయ జీవితమును గడుపును.

మన శరీరములోని ప్రతి అవయవమును దేవుని సేవకొరకు వినియోగించుట ద్వారా మన శరీరములను సమర్పించు కొనగలము. "మీ అవయవములను నీతి సాధనములుగా దేవునికి అప్పగించు కొనుడి" (రోమా 6 : 13). "మీ శరీరమందు పాపమును ఏల నియ్యకుడి" (రోమా 6 : 12). "క్రీస్తు మీలో ఉన్న యెడల మీ శరీరము పాపము విషయమై మృతమైనది" (రోమా 8:9). "మనము శరీరమునకు ఋణస్థులము కాము" (రోమా 8:12).

(5) దేవుడు మనకు ఇచ్చిన సామర్థ్యాన్ని హృదయపూర్వక ముగా నిర్వర్తించాలి. హృదయంలో నిశ్చయించిన ప్రకారము కానుకలు ఇచ్చుట (2 కొరిం 9:7), హృదయపూర్వకముగా పాటలు పాడుట (ఎఫె 5:19), పట్టుదలతో ప్రార్థించుట (ఎఫె 6 : 20), ఇతరులకు మేలు చేయుటయందు విసుగక యుండుట (గలతీ 6:9).

(6) మనము పూర్తిగా క్రీస్తుకొరకే జీవించుట ద్వారా మన శరీరములను దేవునికి సమర్పించుకొనగలము.

పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "నామట్టుకైతే బ్రతుకుట క్రీస్తు చావైతే లాభము" (ఫిలిప్పి 1:21). ఎంత గొప్ప నిశ్చయము! తన

శరీరమును క్రీస్తు సేవకై వినియోగించినాడు. పాతనిబంధనలో దేవునికి బలిగా ఈయవలెనని సిద్ధపరచిన జంతువు దేవునిదే. దానిని మరి దేనికి ఉపయోగించరాదు. అట్లే మన శరీరము దేవునిదే గాని సాతానుకు ఈయరాదు - ఈలోక ఆశలను నెరవేర్చుకొనుటకు శరీరాన్ని వాడరాదు. "ఎందుకనగా దేహముతో జరిగించిన వాటి ఫలము ప్రతివాడును పొందునట్లు మన మందరమును క్రీస్తు న్యాయపీఠము యెదుట ప్రత్యక్షము కావలెను" (2 కొరింథి 5 : 10).

పైనున్న వాటియందే మన మనస్సు ఉంచాలి. భూసంబంధమైన వాటిమీద మనస్సు పెట్టకుడి (కొలస్స 3 ; 2,3). "విరిగి నలిగిన మనస్సే దేవుని కిష్టమైన బలులు" (కీర్త 51 : 17).

కావున ప్రియులారా, మన శరీరమును దేవునికి సమర్పించుకొనవలెను. క్రీస్తు కొరకు జీవించవలెను. లోకాశలకు దూరముగా ఉండవలెను. నిత్యజీవముపై మన దృష్టిని కేంద్రీకరించవలెను. దేవునికి మన శరీరములను అర్పించుకొనుట ద్వారా దేవునికి కృతజ్ఞులమై యుందము.

—డి. చిరంజీవి.

కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్.

---

పది ఆజ్ఞలు :

## నీ తలిదండ్రులను ఘనపరచుము

## ( Honour thy Parents )

దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయుల కిచ్చిన పది ఆజ్ఞలు రెండు భాగములుగా యున్నవి. వాటిలో మొదటి నాలుగు ఆజ్ఞలు దేవునితో మానవుని సంబంధమును గూర్చి, తరువాత ఆరు ఆజ్ఞలు

మానవునితో మానవునికి ఉండవలసిన సంబంధమును గూర్చి చెప్పు చున్నవి. మానవునితోను దేవునితోను కూడ మానవుడు సత్సంబంధము కలిగియుండే నేగాని దేవుడు సంతోషించడని ఈ పది ఆజ్ఞలను బట్టి మనము గ్రహించుకోవచ్చును.

దేవుడిట్లు ఆజ్ఞాపించాడు: "నీ దేవుడైన యెహోవా నీ కనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము" (నిర్గమ 20 : 12). మానవునికి మానవునికి మధ్య ఉండవలసిన సంబంధాన్ని తెలియజేసే ఆజ్ఞలలో ఇది మొదటిది. మన తలిదండ్రుల ప్రాముఖ్యతను ఈ యాజ్ఞ తెలియజేయుచున్నది. మానవుడు మొదటి నాలుగు ఆజ్ఞలను పాటించిన యెడల, తరువాత ఆరు ఆజ్ఞలు పాటించుట సులభమగును.

నీ తలిదండ్రులను సన్మానింపుమని దేవుడు ఆజ్ఞాపించాడు. అంటే వారిని గౌరవించాలి, వారి విలువను గ్రహించాలి, వారియెడల భక్తి కలిగియుండాలి. "తల నెరసిన వాని యెదుట లేచి ముసలివాని ముఖమును ఘనపరచి నీ దేవునికి భయపడవలెను" అని లేవీ 19:32 లో ఆజ్ఞాపింపబడినది. పిల్లలు "మొదట తమ యింటివారి యెడల భక్తి కనపరచుటకును, తమ తలిదండ్రులకు ప్రత్యుపకారము చేయుటకును నేర్చుకొనవలెను; ఇది దేవుని దృష్టికి అనుకూలమై యున్నది" యని 1 తిమోతి 5 : 4 లో పౌలు హెచ్చరించాడు. తలిదండ్రులను గౌరవించుట నేర్చుకొంటే దేవునిని గౌరవించుట నేర్చుకోవచ్చునని ఒకరు చెప్పారు. మనము పసిబిడ్డలుగా యున్నపుడు ప్రతి అవసరమును తీర్చినవారు తలిదండ్రులే.

## విధేయత చూపాలి

తలిదండ్రులను మనమెట్లు సన్మానించగలము? వారికి విధేయత చూపుటద్వారా వారిని సన్మానించగలము. "నా కుమారుడా, నీతండ్రి

ఉపదేశము ఆలకింపుము, నీ తల్లి చెప్పు బోధను త్రోసివేయకుము" అని సొలొమోను రాజు చెప్పాడు (సామె 1:8). ఎఫెసీ 6:1-3లో పౌలు ఇట్లు హెచ్చరించుచున్నాడు: "పిల్లలారా, ప్రభువు నందు మీ తలిదండ్రులకు విధేయులై యుండుడి; ఇది ధర్మమే. నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము; అప్పుడు నీవు భూమి మీద దీర్ఘాయుష్మంతుడ వగుదువు. ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది". "పిల్లలారా, అన్ని విషయములలో మీ తలి దండ్రుల మాట వినుడి; ఇది ప్రభువును బట్టి మెచ్చుకొనదగినది" యని కొలస్స 3:20లో అతడు మరల చెప్పాడు.

తలిదండ్రులకు అవిధేయులగుట వలన ప్రతిఫలము వేరుగా యుంటాది. ఇశ్రాయేలీయులకు దేవుడు ద్వితీ 21:18-21 లో ఇట్లు చెప్పాడు: "ఒకని కుమారుడు మొండివాడై తిరగబడి తండ్రిమాట గాని తల్లి మాటగాని వినక యుండి, వారు అతని శిక్షించిన తరువాత యును అతడు వారికి విధేయుడు కాకపోయిన యెడల అతని తలి దండ్రులు అతని పట్టుకొని ఊరి గవిని యొద్ద కూర్చుండు పెద్దల యొద్దకు అతని తీసికొని వచ్చి, మా కుమారుడైన వీడు మొండివాడై తిరుగబడియున్నాడు. మా మాట వినక తిండిబోతును త్రాగుబోతును ఆయెనని ఊరి పెద్దలతో చెప్పవలెను. అప్పుడు ఊరి ప్రజలందరు రాళ్ళతో అతని చావగొట్టవలెను. అట్లు ఆ చెడుతనమును నీ మధ్య నుండి పరిహరించుదువు. అప్పుడు ఇశ్రాయేలీయులందరు విని భయ పడుదురు".

తలిదండ్రులకు అవిధేయులగు పిల్లలను ఈ రోజుల్లో మనము ఎక్కువ చూస్తున్నాము. "తన తండ్రినైనను తల్లినైనను శపించు వాడు నిశ్చయముగా మరణశిక్ష నొందునని" నిర్గమ 21:17లో దేవుడు ఇశ్రాయేలీయులకు చెప్పాడు. "ఎవడు తన తండ్రినైనను తల్లినైనను దూషించునో వానికి మరణశిక్ష విధింపవలెను. వాడు తన

తండ్రినో తల్లినో దూషించెను గనుక తన శిక్షకు తానే కారకుడు" అని లేవీ 20 : 9లో చెప్పబడినది.

తలిదండ్రుల నపహసింపని పిల్లలవలన వారు సన్మానింప బడతారు. అయితే "తండ్రిని అపహసించి తల్లి మాట విన నొల్లనివాని కన్ను లోయ కాకులు పీకును. పక్షిరాజు పిల్లలు దానిని తినును" అని సామెతలు 30:17లో వ్రాయబడి యున్నది. మరల "తన తండ్రినైనను తల్లినైనను కొట్టువాడు నిశ్చయముగా మరణశిక్ష నొందునని" నిర్గమ 21:15లో చెప్పబడియున్నది.

## ఆదుకోవాలి

తలిదండ్రుల యొక్క అవసానకాలములో వారిని ఆదు కొనుటవలన బిడ్డలు వారిని సన్మానింప గలరు. వృద్ధాప్య ములోయున్న తలిదండ్రుల యెడల బిడ్డలకున్న బాధ్యతను గూర్చి బైబిలు ఎక్కువ బోధించుచున్నది. "నిన్ను కనిన నీ తండ్రి ఉపదేశము అంగీకరించుము. నీ తల్లి ముదిమియందు ఆమెను నిర్లక్ష్యము చేయకుము" అని జ్ఞానియైన సొలొమోను సామెతలు 23:22 లో పలికాడు. 1 తిమోతి 5:4లో అపొ. పౌలు ఇట్లు చెప్పాడు: "ఏ విధవరాలికైనను పిల్లలుగాని మనుమలుగాని యుండినయెడల, వీరు మొదట తమ యింటివారియెడల భక్తి కనబరచుటకును, తమ తలిదండ్రులకు ప్రత్యుపకారము చేయుటకును నేర్చుకొనవలెను." మరల, "ఎవడైనను స్వకీయులను విశేషముగా తన యింటివారిని సంరక్షించకపోయిన యెడల వాడు విశ్వాస త్యాగము చేసినవాడై అవిశ్వాసికన్న చెడ్డవాడై యుండును" అని 8వ వచనములో అతడు చెప్పాడు. మిత్రులారా, మన తలిదండ్రులు బలహీనముగా యున్న యెడల వారిని అన్ని విషయములలోను మనము ఆదుకోవాలి.

తలిదండ్రులకు విధేయుడై యేసుప్రభువు మనకొక గొప్ప

మాదిరిని నెలకొల్పాడు. ఆయన తన తలిదండ్రులకు లోబడి యుండెనని లూకా 2:51 లో వ్రాయబడియున్నది. సిలువపై వ్రేలాడుచు కూడ యేసుప్రభువు తన తల్లిని గూర్చి ఆలోచించాడు. ఆయన యోహానును చూచి "యిదిగో నీ తల్లి అని చెప్పెను. ఆ గడియనుండి ఆ శిష్యుడు ఆమెను తన యింట చేర్చుకొనెను" అని యోహాను 19:27లో వ్రాయబడి యున్నది.

తరువాత, తలిదండ్రులు సన్మానించబడాలంటే వారు కూడ గౌరవప్రదమైన జీవితాన్ని జీవించాలి. అబ్రాహాము గౌరవింపబడతగిన తండ్రివలె జీవించాడు. అబ్రాహామును గూర్చి దేవుడు ఇట్లు తలంచాడు: "యెహోవా అబ్రాహామును గూర్చి చెప్పినది అతనికి కలుగజేయునట్లు తన తరువాత తన పిల్లలును తన యింటివారును నీతి న్యాయములు జరిగించుచు యెహోవా మార్గమును గైకొనుటకు అతడు వారి కాజ్ఞాపించునట్లు నేనతని ఎరిగియున్నాను" (ఆది 18:19).

సన్మానింపబడగోరు తలిదండ్రులు తమ పిల్లలను క్రమశిక్షణలో పెంచాలి. అట్టి బాధ్యతను వారు కలిగియున్నారు. "తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువుయొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి" యని పరిశుద్ధాత్ముడు ఎఫెసీ 6 : 4లో హెచ్చరించుచున్నాడు. పిల్లలచే గౌరవింపబడగోరు తలిదండ్రులు తమ బిడ్డలను సరియైన విధంగా, మంచి మార్గములో పెంచాలి. "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగి పోడని" దేవుని వాక్యము చెప్పుచున్నది (సామె 22 : 6).

తలిదండ్రులను సన్మానించుటవలన బిడ్డలకు దీర్ఘాయువు వాగ్దానము చేయబడినది. పది యాజ్ఞలలో వాగ్దానముతో కూడిన మొదటి ఆజ్ఞ యిది. నీవు యెహోవా వలన ఆశీర్వదింపబడ గోరుచున్నావా?

నీ తలిదండ్రులను సన్మానించుము. వారు క్రైస్తవులు కాకపోతే, వారు నీవుకూడ క్రైస్తవులై క్రీస్తుకొరకు జీవించాలి. దేవుని ఘన పరచువాడు తప్పక తలిదండ్రులను సన్మానించగలడు.

—జాషువా కూటం.

---

## దేవత్వములో ఒక్కరా లేక ముగ్గురా?

**(The Godhead—One or Three?)**

(గత సంచిక తరువాయి)

—వి. యి. హోవర్డు

ఏదైనా ఒక సంగతి ఇద్దరు సాక్షులవలన యదార్థమని నిరూపింపబడును. దేవత్వమును గూర్చి దేవుడు, క్రీస్తు కూడ సాక్ష్యము పలుకుచున్నారు. అందువలన దేవత్వములో కనీసం దేవుడు, క్రీస్తు వున్నారు. యోహాను 8:17, 18లోని దైవిక ప్రబోధము యిది వాస్తవమని నిరూపించుచున్నది. "మరియు ఇద్దరు మనుష్యుల సాక్ష్యము సత్యమని మీ ధర్మశాస్త్రములో వ్రాయబడియున్నది గదా! నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పుకొనువాడను, నన్ను పంపిన తండ్రియు నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాడని" క్రీస్తు పలికెను.

దేవుడు, క్రీస్తు రెండు వ్యక్తిత్వములు అనే విషయాన్ని తిరస్కరిస్తే బైబిలులో రెండు దైవిక సాక్ష్యములను తిరస్కరించుటయే. ఈ విషయం ఎట్లు సాధ్యమో ఊహించగలరా? తండ్రి కుమారుని లోకములోనికి పంపెను. దేవునికి కుమారుడున్నాడు. క్రీస్తునకు తండ్రి ఉన్నాడు. ఆయనే దేవుడు.

### ఒకే దేవుడు — మరియు దేవుని తల్లా

తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు ఒకే వ్యక్తి అయితే

రోమన్ కాథలిక్ సంఘము చెప్పే అబద్ధ సిద్ధాంతము ప్రకారము మరియ దేవుని తల్లి! మరియ యేసునకు తల్లి. క్రీస్తు, దేవుడు ఒకే వ్యక్తి అయితే మరియ దేవుని తల్లి.

ఇది అబద్ధ సిద్ధాంతము. ఇది అవమానకరమైన సిద్ధాంతము. దేవుని స్థానమునుండి ఆయనను దిగజార్చి మానవునితోను సృష్టితోను సమానముగా చేయు సిద్ధాంతము.

## వారు ఏకమై యున్నారు

తండ్రియైన దేవుడు, కుమారుడైన క్రీస్తు మరియు పరిశుద్ధాత్ముడు యేకమై యున్నారు. కాని ఒకే వ్యక్తిగా కాదు. వారు వేర్వేరు వ్యక్తులు. అయినప్పటికి క్రియంలోను, ప్రయోజనంలోను, సంకల్పములోను ఏకమై యున్నారు.

కుమారుడు తండ్రికి చేసిన ప్రార్థనలో (యోహా 17:20,21). ఆయన, తండ్రి ఏకమై యున్నట్లు ఆయన శిష్యులంతా ఏకమై యుండవలెనని ప్రార్థించెను. శిష్యులంతా ఒకేఒక్క వ్యక్తిగా ఉండాలని ప్రార్థించ లేదు. ఆయన ఈలాగు ప్రార్థించెను: "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండవలెనని వారి కొరకు మాత్రము నేను ప్రార్థించుటలేదు. వారి వాక్యము వలన నా యందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను". తండ్రి, నేను యేకమైయున్నామని క్రీస్తు చెప్పినందువలన దేవుడు క్రీస్తు ఒకే వ్యక్తి అయినట్లయితే శిష్యులందరు చాలామంది వ్యక్తులు కారు. అందరును ఒకే వ్యక్తియై యున్నారు. ఎందుకనగా "అందరు యేకమై యుండవలెనని" క్రీస్తు ప్రార్థించెను. తండ్రి క్రీస్తు ఒకేవ్యక్తి అయినట్లయితే ప్రార్థనలో ప్రభువు చెప్పినట్లు శిష్యులు కూడ ఒక వ్యక్తి మాత్రమే కాదు. వారు దేవుని

తోను క్రీస్తుతోను సమానమై యున్నారు. ఈ అబద్ధ సిద్ధాంతము మానవుని దేవునిగ చేయుచున్నది.

క్రైస్తవులు క్రీస్తుతో యేకమై యున్నారంటే క్రైస్తవులు దేవుడని అర్థమా? ఇది నమ్మదగిన విషయం కాదు. దేవుడు క్రీస్తు ఏకమై యున్నట్టు క్రైస్తవులందరు ఏకమై యుండవలెను. ఒక్క వ్యక్తిగా కాదు.

భార్యాభర్తలు ఏకమై యుండాలని పౌలు చెప్పినప్పుడు ఒక్క వ్యక్తిగా ఉండాలని కాదు. "ఈ హేతువుచేత పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును. వారిద్దరు ఏకశరీరమగుదురు" (ఎఫె 5:31). "వారిద్దరు ఏకశరీరమగుదురు" అని చెప్పినప్పుడు ఒక్క వ్యక్తియై యుండాలని అర్థమా? ఎంత అర్థరహితము!

కొన్ని సంవత్సరాల క్రితము పెంతెకోస్తు సంఘానికి చెందిన ఒక పెద్దమనిషితో ఒక బహిరంగ తర్కము (Public Debate)లో పాల్గొన్నాను. ఆయన దేవత్వము నందు ఒకే వ్యక్తి యున్నాడని చెప్పుచున్నాడు. అక్కడ ఒక సంగతి జరిగెను. నా ప్రత్యర్థిని బోధకుడైన అతని స్నేహితుడు "పవిత్రమైన ముద్దు" వేదికపై పెట్టుకొని అతని అభినందించెను. తర్క సమయంలో నా ప్రత్యర్థిని నీకు వివాహమయిందా? అని అడిగాను. "అయిందని" చెప్పాడు. అతనితో ఇలా చెప్పాను: "పౌలు భార్యభర్తలు ఏకశరీరమై యుండాలని చెప్పాడు. ఏకమై యుండాలని బోధించే ఈ మాటలను ఒకే వ్యక్తియై యుండాలని చెప్పుచున్నావు గనుక బోధకుడైననీ స్నేహితుడు నిన్ను ముద్దుపెట్టుకొని అభినందించుట నీ భార్యనుకూడ ముద్దుపెట్టుకొన్నట్లే". అన్న వెంటనే నా ప్రత్యర్థి "ఏకమై" యుండాలంటే ఒకే వ్యక్తియై యుండాలని అర్థం కాదని చెప్పాడు. దేవుడు క్రీస్తు పరిశుద్ధాత్మ ఒకే వ్యక్తియై యున్నారని అనకూడదు. వారు ఏకమైయున్నారని బైబిలు చెప్పుచున్నది

2 యోహాను 9వ వచనము యిట్లు బోధించుచున్నది: "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు". తండ్రిని కుమారుని అనగా "యిద్దరిని" అని లేఖనభాగము తెలియజేయుచున్నది.

అభ్యంతరం :

## యేసు - దేవుడు సశరీరుడుగా ప్రత్యక్షమయ్యెను

దేవత్వములో ఒకే వ్యక్తి యున్నాడని చెప్పేవారు చెప్పే కొన్ని అభ్యంతరాల్ని పరిశీలిద్దాం. తండ్రియైన దేవునిగూర్చి కుమారుడైన యేసుక్రీస్తునుగూర్చి బైబిలు చెప్పుచుండగా ఒకేవ్యక్తి యున్నాడని చెప్పుటకు నిలువబడినవారు క్రీస్తు శరీరముతో ప్రత్యక్షమైన దేవుడని చెప్పుచున్నారు. ఇద్దరు వ్యక్తులు కాదు, ఒకేవ్యక్తి శరీరాకారముతో వచ్చెను. క్రీస్తు అనగా శరీరాకారముతో ప్రత్యక్షపరచబడిన దేవుడు లోకమునకు వచ్చెను. అందుచేత క్రీస్తే దేవుడు. ఒకే ఒక వ్యక్తి అని చెబుతారు.

"యేసుయొక్క జీవము మా శరీరమందు ప్రత్యక్షపరచబడుటకై యేసుయొక్క మరణానుభవమును మా శరీరమందు ఎల్లప్పుడును వహించుకొని పోవుచున్నాము" (2 కొరింథీ 4:10). యేసుయొక్క జీవము మా శరీరమందు ప్రత్యక్షపరచబడుటకు అని పౌలు చెప్పుట వలన పౌలు శరీరము క్రీస్తు శరీరమయ్యెనా? పౌలు క్రీస్తు ఇద్దరు ఒక్కరేనా? ఇదెంత హాస్యాస్పదము! ఈ 'ప్రత్యక్షత' సిద్ధాంతము నిజమైతే పౌలు యేసుక్రీస్తే! క్రీస్తును ఇశ్రాయేలుకు ప్రత్యక్షపరచుటకు నేను నీళ్ళలో బాప్తిస్మమిచ్చుచు వచ్చితినని బాప్తిస్మమిచ్చు యోహాను చెప్పెను (యోహా 1:31). బాప్తిస్మమిచ్చు యోహాను

క్రీస్తు ఏకమైయున్నారని ఒకే వ్యక్తి యని ఎవరైనా చెప్పగలుగుట సాధ్యమా ?

ఆయన (కుమారుడు) దేవుని తత్వముయొక్క మూర్తి మంతము నైయుండి...(హెబ్రీ 1:1-3). ఆయన 'తత్వము' అని చెప్పుటవలన "ఒకే పోలిక" అని భావించి దేవుడు క్రీస్తు ఒకేవ్యక్తి అనే తొందర పాటు నిర్ణయానికి కొందరు మత నాయకులు వచ్చిరి. కాని యిది అవివేకమైన యోచన. దేవుని పోలికగా మానవుడు సృజింపబడినట్లు బైబిలు చెప్పుచున్నది. పోలిక అనగా రెండు ఒకటే అర్థము అని భావించుచున్నారు. పోలిక (Image) అనగా రెండూ ఒకటే (Identity) అని అర్థము కాదు.

## దేవునిలో క్రీస్తు – క్రీస్తులో దేవుడు

తండ్రి, ఆయన యేకమైయున్నట్టు ప్రభువు ఖచ్చితముగ సెల విచ్చెను. కాని ఒకేవ్యక్తి అని చెప్పుటలేదు. మన గురువు ఆయన తండ్రికి ఈలాగు ప్రార్థించెను: "తండ్రీ - నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండవలెనని వారి కొరకు మాత్రము నేను ప్రార్థించుటలేదు. నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు..." (యోహా 17:21-26). "తండ్రీ నాయందు నీవును" అనే మాట చదివి దేవుడు, క్రీస్తు ఒకరే అను అసత్యముతో కూడిన ముగింపునకు కొందరు వచ్చిరి.

ఈలాంటి అబద్ధబోధలు వాక్యానుసారము కాదని చెప్ప డానికి ఇక్కడ రెండు బలమైన వాక్యాధారాలున్నాయి. నెం. 1: యేసు తన ప్రార్థనలో వారిని అనగా శిష్యులను గూర్చి ప్రార్థించెను. "తండ్రీ నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండవలెనని". నీవును నేనును ఏకమై యున్నట్లు

శిష్యులును మనయందు ఏకమైయుండవలెనని (11వ వచనం కూడ చదవండి) ప్రార్థించెను. యేసు మరియు దేవుడు ఒకేవ్యక్తి అయితే ఆ కారణాన్ని బట్టి యేసు, దేవుడు, శిష్యులు అంతా ఒకే వ్యక్తియై యుండాలి. వచనము 23లో ఆయన యిట్లు చెప్పెను: "వారియందు నేనును నాయందు నీవును ఉండుటవలన వారు సంపూర్ణులుగా చేయ బడి ఏకమైయున్నందున...మహిమను వారికి ఇచ్చితిని." తండ్రి కుమారుడు ఏకమైయున్నట్లు శిష్యులు క్రీస్తుతోను తండ్రితోను ఏకమైయున్నారు. అందరూ కలిసి ఒకే వ్యక్తిగా కాదు. దేవుడు, క్రీస్తు కైస్తవులు కలిసి ఒకే వ్యక్తియై యున్నారనుట అర్థరహితము !

నెం. 2 : దేవుని కుమారుడైన క్రీస్తు, తండ్రియైన దేవుడు ఒకే వ్యక్తి కాదు. ఎందుకనగా యేసు భూమిమీదనుండి పరలోకమందున్న తండ్రిని ప్రార్థించెను. ఈ ప్రార్థన యోహా 17:1లో చదవండి. "తండ్రీ నా గడియ వచ్చియున్నది. నీ కుమారుడు నిన్ను మహిమపరచునట్లు నీ కుమారుని మహిమ పరచుము". మరల 5వ వచనము చదవండి. "తండ్రీ లోకము పుట్టకమునుపు నీయొద్ద నాకు ఏ మహిమ యుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీయొద్ద మహిమ పరచుము" గమనించండి. దేవుని ఆయన తండ్రీ యని సంబోధించెను. "నీ కుమారుడు నిన్ను మహిమపరచునట్లు" కుమారుని మహిమపరచుము. ఈ మహిమ, లోకము పుట్టకమునుపు నీయొద్ద నాకుండెను.

దేవుడు క్రీస్తు ఒకేవ్యక్తి యనువారు, క్రీస్తు దేవుని కుమారుడనే సంగతిని తిరస్కరించుచున్నారు. యోహాను 17వ అధ్యాయంలో వ్రాయబడిన ప్రభువు ప్రార్థనను వారు హేళన చేయుచున్నారు. తండ్రి, కుమారుడు అనే మాటలు వారికి అర్థం కావడంలేదు. "ఒక

కుమారుడు అతనికే తండ్రి కాగలడా? ఒక తండ్రి అతనికే కుమారుడు కాగలడా? దేవునికి కుమారుడున్నట్లయితే ఆయన యేసు, ఆయనకు తండ్రి ఉండెను. తండ్రి లేకుండ కుమారుడు లేడు. సృష్టిలో ఆదాముకు దేవుడు తండ్రియై యున్నాడు. దేవత్వమునందుగల మూడు వ్యక్తిత్వములను తిరస్కరించుట యేసు దేవుని కుమారుడని తిరస్కరించుటయే.

## ఒకే ఆత్మ, ముగ్గురు వ్యక్తులు

బైబిలు ఆత్మ ఒకడే అని చెప్పుచున్నది కనుక దేవత్వమునందు ఒకేవ్యక్తి యుండెనని కలవరపర్చే కొందరు మతనాయకులు చెప్పుచున్నారు. దేవత్వమునందు ముగ్గురు వ్యక్తులున్నారు. అందు ఆత్మ ఒక వ్యక్తి. ఎఫె 4:4-6లో దైవావేశమువలన "ఆత్మయు ఒక్కడే", "ప్రభువు ఒక్కడే", "తండ్రియైన దేవుడు ఒక్కడే" అని చెప్పబడినది.

ఇప్పుడు ఎంతమంది? కలపండి ఒకేఆత్మ, ఒకే ప్రభువు, ఒకే దేవుడు. ఒకటి, రెండు, మూడు. ఎంత సులభముగా నున్నది! అయినప్పటికి, అబద్ధ బోధకులు ఈ కూడిక విషయంలో తమ పంథాలోనే యున్నారు. ఒకటి, రెండు, మూడు ఇలా లెక్కపెట్టి జవాబు ఒకటని చెప్పుట ఎంత హాస్యాస్పదము. ఈ వచనాన్ని బట్టి తండ్రియైన దేవుడు మొదటి వ్యక్తి, కుమారుడైన క్రీస్తు రెండవ వ్యక్తి, పరిశుద్ధాత్మ మూడవ వ్యక్తి. ఈ ముగ్గురు దైవత్వముగా నున్నారు.

## క్రీస్తు శరీరమే దేవుని కుమారుడా?

కొన్నిసార్లు క్రీస్తు శరీరం దేవుని కుమారుడని ఆయన ఆత్మ ఒక వ్యక్తి కాదని కొందరి అభిప్రాయము. మనం పరిశీలిస్తే, సమా

ధిలో ఏమున్నది? దేవుడు, క్రీస్తు, ఆత్మ ఒక్కరే యైనయెడల, యూదులు క్రీస్తును చంపినపుడు, తండ్రిని, క్రీస్తును, పరిశుద్ధాత్మను కూడ చంపిరి. క్రీస్తు శరీరము మాత్రమేనా? క్రీస్తు శరీరము సమాధి చేయబడలేదా? దేవుని కుమారుడు, దేవుడు సమాధిలో ఉన్నారా? ఆత్మ సమాధిలో లేదు. యేసు ఇట్లు చెప్పెను. "తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను" (లూకా 23:46). యేసు క్రీస్తు దేవుని కుమారుడు కాడనే అబద్ధ బోధను ఎవడు నమ్మగలడు? ఆయన కేవలము శరీరమే అయితే, ఆత్మలను రక్షించునది క్రీస్తు అని చెప్పుట నాటకమే! యెముకలును మాంసమును ఆయనకున్నట్టు యేసు చెప్పెను (లూకా 24:39). దేవుడు ఆత్మయని ఆయన చెప్పెను (యోహా 4 : 24). గనుక దేవుడు, క్రీస్తు వేర్వేరు వ్యక్తులని తెలియుచున్నది.

## క్రీస్తు కనబడెను - దేవుడు కనపడలేదు

దేవుడు క్రీస్తు వేర్వేరు వ్యక్తులైనందున శిష్యులు క్రీస్తును చూచిరి. ఆయనతో నడిచిరి, మాట్లాడిరి. వారికున్నట్లు యేసునకు యెముకలును శరీరము ఉండెను. ఆయన వారితో భోజనము చేసెను. వారితో కలసి ఆయన పనిచేసెను. అయినప్పటికి "ఎవరయినను ఎప్పుడైనను దేవుని చూడలేదని ఆయన చెప్పెను" (యోహా 16:16; 1:18). ఆయన మృతిపొంది లేచిన తరువాత శిష్యులు ఆయనను చూచిరి. పరలోకమునందలి తండ్రియొద్దకు ఆయన ఆరోహణుడగుచుండగా చూచిరి. ఇదే ఆఖరి వాగ్దానము "ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీమీదికి పంపుచున్నాను."

తరువాత ఆయన పరలోకమునకు కొనిపోబడెను (లూకా 24:49-51 అ.కా. 1:9-11). క్రీస్తు భూమిమీద నున్నప్పుడు తండ్రి, కుమారుడు పరిశుద్ధాత్మ పరలోకాన్ని ఖాళీచేసారా? దేవత్వమునందు ఒకే వ్యక్తి యుండెనను బోధ అబద్ధ బోధయైయున్నది. [సశేషం

# క్రీస్తు ఎవరు?

## ( Who is Christ )

మొదటి శతాబ్దములో కొందరు క్రీస్తును బాప్తిస్మమిచ్చు యోహాననియు, కొందరు ఏలీయా అనియు, కొందరు యిర్మీయా అనియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొని ఆయన దేవుని కుమారుడైన క్రీస్తు అనే విషయాన్ని విస్మరించిరి (మత్త 16:14-16). "ఇదిగో వీడు తిండిబోతును మద్య పానీయుడు సుంకరులకును పాపులకును స్నేహితుడునని" కొందరు అభిప్రాయపడిరి (మత్త 11:19). "ఇతడు వడ్లవాని కుమారుడు కాడా? ఇతని తల్లి పేరు మరియ కాదా? యాకోబు యోసేపు సీమోను యూదా యనువారు ఇతని సోదరులు కారా? ఇతని సోదరీమణు లందరు మనతోనే యున్నారు కారా?" యని ప్రశ్నించిరి (మత్త 13:55-56). ఆకాలములో క్రీస్తు మానవుడే యని చాలా మంది అభిప్రాయపడిరి. ఆయన మనుష్యకుమారుడని (Son of man) పిలువబడెను. ఈయనలోని మానవ లక్షణాలను పరిశీలిద్దాం.

## దైవ మానవుడు

ఆయన ఆకలి గొనెను (మత్త 4:2). యేసు ప్రయాణమువలన అలసిపోయెను (యోహా 4:6). ఆయన నిద్రించెను (మత్త 8:24). చేదుకలిపిన ద్రాక్షారసమును ఆయనకు త్రాగనిచ్చిరి గాని ఆయన దానిని రుచి చూచి త్రాగనొల్లకపోయెను (మత్త 27:34). ఆయన బిగ్గరగా కేక వేసి ప్రాణము విడిచెను (మత్త 27:50). "ఆయన మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము

పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:7-8).

యేసు జన్మించిన తరువాత ఆయన 30 సంవత్సరాల జీవితాన్ని గూర్చి (12 ఏండ్లవాడై యున్నప్పుడు జరిగిన ఒక సంఘటన తప్ప) ఎట్టి వివరము క్రీస్తు జీవిత చరిత్రలో అనగా సువార్తలలో వ్రాయబడి యుండలేదు. బహుశ ఆయన ఆ సమయంలో బాలుడుగాను యౌవనస్థుడుగాను కుటుంబములో తనకున్న బాధ్యతను నిర్వర్తించి యుండవచ్చును.

ఈ విషయాలను బట్టి ఆయన మానవుడనే నిర్ణయానికి రాకూడదు. ఆయన మానవాతీతుడుగా మన మధ్యనుంటే మనకు సరయిన మాదిరిని మనకివ్వడం సాధ్యం కాదు. అందుకే ఆయన పాపరహితుడై నప్పటికిని "నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తరమిచ్చి, బాప్తిస్మము పొందెను" (మత్త 3:15-16). ఆయన మానవుల మధ్య మానవునిగా పుట్టి మానవుల యెడల దేవుని చిత్త మేదో దానిని బయలుపరచెను.

ఆయన తల్లి గర్భములో రూపింపబడిన విధానము ఒక మహా అద్భుతము. ప్రకృతి సిద్ధాంతమునకు వ్యతిరేకమైనది. "వారేకము కాకమునుపు ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా నుండెను" (మత్త 1:18). ఈయన దైవత్వానికి యిది మొదటి ఋజువు. "వారక్కడ (బెత్లెహేములో) ఉన్నప్పుడు ఆమె ప్రసవదినములు నిండెను. తన తొలిచూలి కుమారుని కని..." (లూకా 2:6). ఆయన తల్లి గర్భములో రూపింపబడిన తరువాత ఆయన తల్లి గర్భములో ఉండవలసిన కాలము విషయంలో అద్భుతము జరుగలేదు, ఆయన మానవుల మాదిరిగానే జన్మించి వయస్సునందును జ్ఞానము నందును ఎదిగి బలము పొందెను.

# మానవుల దేవుడు

ఆయన చనిపోయిన వారినిసైతం తిరిగి లేపి, వ్యాధిగ్రస్తులను స్వస్థపరచి, కుంటివారిని నడిపించి, అంధులకు దృష్టిని ప్రసాదించి, మూగవారిచేత దేవుని మహిమపర్చే స్వరాలు పలికించిన ఘట్టాలన్నియు ఆయన దైవత్వానికి నిదర్శనాలే. ఆయన మరణాన్ని జయించి తిరిగి లేవడం ఆయన నశించిన దానిని వెదకి రక్షించుటకు లోకమునకు వచ్చిన మనుష్య కుమారుడని విశదమగుచున్నది.

ఆయన బోధల్లో దైవప్రేమ స్పష్టంగా కన్పిస్తుంది. పౌలు చేసిన క్రీస్తు బోధనుండి ఒక వచనాన్ని చదువుదాం. "నీ శత్రువు ఆకలిగొని యుంటే అతనికి భోజనము పెట్టుము. దప్పిగొని యుంటే దాహమిమ్ము" (రోమా 12 : 20). ఈ బోధలు బైబిల్లో తప్ప మరెక్కడా చూడలేము. శత్రువును ప్రేమించి ఆతిథ్యమిచ్చే ఈ మహోన్నత ప్రేమ ఎక్కడిది? సృష్టికర్తయైన దేవునిదేకదా! ఆ ప్రేమ మానవుల మధ్య ఉండాలనేదే దేవుని కాంక్ష.

ప్రేమమూర్తియైన క్రీస్తు మానవుడు దేవుడు. క్రీస్తు దేవుడా? అవును సృష్టియందు ఆయన దేవునితో నుండెను (ఆది కాం. 1 : 26 ఆది 3 : 22). తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ వీరు యేకముగా ఉన్నారు. "మహా దేవుడును మనరక్షకుడునైన యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురు చూచుచు, ఈ లోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను భక్తితోను బ్రతుకుచుండవలెనని మనకు బోధించుచున్నది" (తీతు 2 : 13).

"నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" పేతురు చెప్పెను (మత్త 16 : 16). "యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని

దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు" (రోమా 10 : 9).

క్రీస్తు దేవుని కుమారుడు, రక్షకుడు, ఆయనే సత్యము, మార్గము, జీవము, ఆయనే జీవాహారము, వెలుగు. ఆయన సంఘమునకు శిరస్సు, ఆ సంఘము ఆయన శరీరము.

## సంఘ శిరస్సు

క్రీస్తునకు ప్రాముఖ్యము లేదని వాదించే వారున్నారు. "ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము" (కొలస్స 1:18). ఆయన సంఘమునకు ప్రాముఖ్యము లేదనే దుర్దినాలలో మనం జీవిస్తున్నాము. "క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి, అది కళంకమైనను, ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యములో ఉదక స్నానము చేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను" (ఎఫెసీ 5 : 25-27).

క్రీస్తు ఎవరు ? ఆయనకు సంఘములో గల సంబంధాన్ని మనం పరిశీలించాలి.

క్రీస్తు స్వరక్తముతో ఆ సంఘమును సంపాదించెను (అపొ.కా. 20 : 28). దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను. క్రీస్తు తన్నుతాను అప్పగించుకొని తన రక్తమును దేనికొరకై చిందించెనో అది ప్రాముఖ్యము కాదని చెప్పేవారిని ఏమనాలి ? క్రీస్తును కావాలను కొనేవారు ఆయన సంఘాన్ని కావాలని కోరుకోనడంలేదు. ఒకడు క్రీస్తులో ఉండాలంటే ఆయన సంఘములో వుండాలి.

ఎందుకంటే అది ఆయన శరీరం. సంఘము అవసరంలేదని,

బాప్తిస్మం అవసరం లేదని ప్రభురాత్రి భోజనం అవసరంలేదని చెప్పే వారు క్రీస్తుకు విరోధులు.

సంఘము, క్రీస్తు వేరు కాదని చెప్పే వాక్యాను సారమైన బోధలో నీవుండాలని కోరుకొంటున్నాము. సంఘమునకు ప్రాముఖ్యము లేదని చెప్పే వేలాది మంది జనసమూహాల్లో నీవుండకూడదని మనసార కోరుకొంటున్నాము.

క్రీస్తు సంఘమునకు శిరస్సు. ఎఫెసీ 1 : 22

స్నేహితుడా, ఈ విషయాన్ని విస్మరించకు !

— E. K. V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYAWAKKU**
**P.O. Box. 80**
**KAKINADA-533 001**

**No.**

**To**

..........................................

..........................................

..........................................

..........................................